11

# చెర కాలము

## యెరూషలేము పతనమునుండి జెరుబ్బాబెలు క్రింద తిరిగి వచ్చువరకు, (క్రీ. శ. 586-536)

**పరిచయము. – పరిశీలనము, సంగ్రహము.** – ఇప్పుడు మనం మానవుని యొక్క పాపపు చరిత్రను, విమోచనయొక్క ముందటి అంచల జాడను కనుగొన్నాం. అబ్రాహాము పిలువబడినది మొదలుకొని, దాని వెనువెంట వచ్చిన కాలములను అంటే: పితరుల కాలం, దాస్యము, ప్రయాణాలు, యుద్ధ విజయాలు, న్యాయాధిపతులు, ఐక్య రాజ్యము, ద్వంద్వ రాజ్యము, యూదా మాత్రమే అనే పదిహేను వందల సంవత్సరాలు ఏర్పరచబడిన ప్రజలయొక్క భోగభాగ్యాలను మనం చూచుకొంటూ వచ్చాం. దావీదు, సొలొమోనుల దినాలలో జాతీయ జీవితం పొంగి పొరలిన మహిమను, దాన్ని వెంటాడిన విభజన మరియు క్షీణతను మనం చూచుకొంటూ వచ్చాం.

ఉత్తర రాజ్యము రాజకీయమైన అంధకారంలోనికిని, ఆత్మసంబంధమైన రాత్రికిని దిగజారిపోయినట్టు చూచాం. యూదా, తదనంతరం నూటా నలభై సంవత్సరాలు ఎక్కువగా తగిన జీవిత విధానాన్ని కొనసాగించింది, తరువాత చిన్నాభిన్నమై, యెరూషలేము శిథిలావస్థలో నిలిచిపోయింది, మరియు రాజులు, ప్రజలు ఏడు వందల మైళ్ల దూరంలో ఉన్న బబులోనుకు కొనిపోబడినవారై, నిస్సహాయమైన చెరలో పెట్టబడ్డారు. ఎక్కడ చూచినా మృగ స్వభావము, పూర్తిగా మూఢనమ్మకాలు, మరియు విగ్రహారాధనయే విజయ భేరిని మ్రోగిస్తున్నాయి. మానవులకు గోచరమయ్యేదంతా, మానవ విమోచన యొక్క పరిశోధన అంత విఫలమైనట్టును, దేవుని గూర్చిన జ్ఞానము శాశ్వతంగా నశించిపోయినట్టు మాత్రమే ఉంది. అయితే అది పరిశోధనయే కాదు. కటిక చీకటిగానున్న రాత్రిలోనుండి అతి ప్రకాశవంతమైన నిరీక్షణయనే నక్షత్రము వెలిసింది. ఉత్తర రాజ్యం అంతరించిన తరువాత, యూదా క్షీణించి చెరగొనిపోబడనైయున్న కాలంలో, మీకా, యెషయా, యిర్మీయా, దానియేలు, జెకర్యా వంటి ప్రవక్తలు లేచి లోకవ్యాప్తంగా ఉండే క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన ఏలుబడిని గూర్చిన ప్రవచనాలను లిఖించారు. హెబ్రీయుల దైవికమైన ఏలుబడి ముండ్ల చెట్టులా కాంతి విహీనంగా ప్రారంభమయ్యింది, అది పూర్తిగా ఆత్మ సంబంధమైన రాజ్యముగా పువ్వులు, కాయలు సంపూర్తి చేయబడాలి. పుష్పాలు వికసించే వరకు, ముండ్ల మొక్క నిలిచియుండాలి. అందువలన, అన్యదేశాల్లో పరవాసులైనా, చెదరగొట్టబడినా, యూదా తిరిగి జాతీయ జీవితానికి తిరిగి వచ్చి, సరిక్రొత్తదిగా చేయబడవలసియుంది.

చెర కాలాన్ని గూర్చి మాటిమాటికి, యెషయా, మీకా, యిర్మీయాలాటి ప్రవక్తలు, హుల్దావంటి ప్రవక్తిణిలు ముందుగా సూచించుతూ వచ్చారు. (2 రాజులు 20:17; 21:10-15; 22:14-17; యిర్మీయా 25:9-11; 34:2, 3; మీకా 3:8-12లను చూడు.) ఈ ప్రవచనాలన్నీ అనుకోకుండగనే నెబుకద్నెజరు యెరూషలేమును ముట్టడి వేయడం, మాటి మాటికి యూదులను తన దేశంలోనికి తరలించడంలో నెరవేర్చబడ్డాయి.

**1. యిర్మీయా, ఐగుప్తునందు పరదేశ నివాసం** (2 రాజులు 25:22-26; యిర్మీయా 40-44). - యెరూషలేము నాశనం చేయబడిన పిమ్మట, బహు అల్ప సంఖ్యాకులు పశువుల కాపరులుగాను, ద్రాక్షా తోటలు కాపుచేయువారుగాను విడిచిపెట్టబడ్డారు. బబులోనుకు క్షేమంగా తరలింపబడడానికి యిర్మీయా యిష్టపడలేదు. తాను ప్రేమించిన దేశపు శిథిలాలలోనే మిగిలిపోవాలని అతడు ఆశ చూపాడు. అయితే శేషించినవారు తమలో తాము తగవులాడుకొన్నారు, వారి అధిపతియైన గెదల్యా, ఇష్మాయేలు క్రింద కుట్ర పన్నిన యూదుల మూకచేత హత్య చేయబడ్డాడు. మిగిలినవారు, నెబుకద్నెజరు పగ తీర్చుకుంటాడనే భయముతో యోహానాను నాయకత్వంలో ఐగుప్తుకు పారిపోతారు. యిర్మీయా ఐగుప్తుకు వెళ్లడానికి తన ఆక్షేపణ తెలియజేస్తాడు; కాని తన ప్రియమైన దేశాన్ని విడిచిపోయేలా బలవంత పెట్టబడతాడు, ఐగుప్తుకు వెళ్లే చెర నివాసులను అతడు వెంబడింపవలసి వస్తుంది. అక్కడ తహపనేసు అనే ప్రాకారములు గల పట్టణంలో ఆ గొప్ప ప్రవక్త తన కడపటి ప్రవచనాన్ని వ్రాశాడు, ఆది క్రైస్తవ పారంపర్యం ప్రకారం, తనతోటి చెర నివాసుల చేతుల్లో అతడు హత సాక్షియైనట్టు చెప్పబడింది; యూదుల పారంపర్యం ప్రకారమైతే, అతడు ఐగుప్తునుండి తప్పించుకొని బబులోనుకు వెళ్లాడు. అయితే యిందులో, అనేకమైన యితర సంఘటనలవలె, అంటే, యెషయా, యెహెజ్కేలు, దానియేలు, పేతురు, పౌలు, యోహానులవలెనే, తన రచనలచేత లేఖనాలు ఎంతో ఎక్కువగా అలంకరింపబడినా, తన జీవితపు అంత్యపు దృశ్యాల విషయంలో నిశబ్దంగా మిగిలి పోయాయి. ఐగుప్తు చెర నివాసులు తిరిగి వచ్చినట్టు ఏ ఆధారమూ లేదు.

**2. దానియేలు, బబులోను తొలి చెర** (2 రాజులు 24:1; 2 దినవృ. 36:5-8; దానియేలు 1-12). - నెబుకద్నెజరు యెరూషలేము మీదికి మూడు దండయాత్రలను చేసినట్టు మనం చూచాం. మొదటి సారి (క్రీ.పూ. 606లో) రాజ వంశీయులైన నలుగురు బాలురను అంటే, దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగో అనే వారిని తీసికొనిపోయాడు. రాజుయొక్క దర్బారులో వారు గౌరవపదంగా విద్యనభ్యసించేలా ఏర్పాటు గావించబడ్డారు. అయితే ఆరంభంలోనే బబులోను యొక్క విలాసాలకు, మరియు బబులోను యొక్క విగ్రహారాధనకు వేరుగా నిలిచి గొప్ప నిర్ణయంతో జీవితాన్ని గడపగోరారు.

ఎ. నెబుకద్నెజరు కల. - తల మేలిమి బంగారము, దాని రొమ్ము వెండి, దాని ఉదరము తొడలు ఇత్తడివి, దాని మోకాళ్లు ఇనుపవియైయున్న మహా విగ్రహమును గూర్చిన నెబుకద్నెజరు కలను, దాని భావమును చెప్పడంవలన దానియేలు మొదట గుర్తింపులోనికి వచ్చాడు. దానియేలు చెప్పిన భావమునుబట్టి శిరస్సు నెబుకద్నెజరును సూచించింది; తక్కిన భాగాలు తనవెంట వచ్చే గొప్ప సామ్రాజ్యాలను సూచించాయి.

**బి. అగ్నిలో ముగ్గురు మనుష్యులు.** - తన కల అనంతరం నెబుకద్నెజరు గర్వముతో

రెచ్చిపోయాడు. అతడు బహు గొప్ప విగ్రహాన్ని నిలిపాడు, తన సంస్థానాలలో ఆధిక్యత వహించిన వారందరు ఆ ప్రతిమకు మ్రొక్కాలని ఆజ్ఞాపించాడు. షద్రకు, మేషక్, అబెద్నెగోలు తమ విశ్వాసమునందు స్థిర చిత్తులై, అందుకు నిరాకరించారు. దానికి శిక్షగా వారు మండుచున్న వేడిమిగల కొలిమిలో పడవేయబడియు, అద్భుతరీతిగా కాపాడబడ్డారు.

**సి. దానియేలు దర్శనము.** – దానివెంట రానున్న ప్రపంచ సామ్రాజ్యాలను గూర్చి దానియేలను తనకే ఆయా దర్శనాలు కలిగాయి: బబులోను, పారసీకము, మాసిదోనియ, రోమా, మరియు స్థాపింపబడనైయున్న దేవుని రాజ్యము లోకమంతటను వ్యాపించి, శాశ్వతంగా ఉండబోయే దానిగూర్చి దర్శనాలు అతనికి కలిగాయి.

**డి. దానియేలు సింహాల గుహలో ఉంచబడ్డాడు.** – రేగుచున్న పారసీకపు రాజ్యం ఎదుట బబులోను అంతరించడాన్ని చూచేవరకు దానియేలు జీవించాడు. ఆజ్ఞాపించగల అతని సామర్థ్యాలు పారసీకపు దర్బారు ఉద్యోగుల అసూయను పొందింది. అనుదిన ప్రార్థనలో అతని నమ్మకత్వము సింహాలకు ఎరగా చేసింది, కాని దైవికంగా అతడు కాపాడబడ్డాడు.

**3. యెహెజ్కేలు, రెండవ బబులోను చెర** (2 రాజులు 24:8–16; 2 దినవృ. 36:9, 10; యెహెజ్కేలు 1:1, 2). – తన రెండవ దండయాత్ర సమయమున (క్రీ.పూ. రమారమి 597), నెబుకద్నెజరు పదివేల మందిని చెర పట్టుకొని పోయాడు; వారిలో ప్రవక్తయైన యెహెజ్కేలు ఉన్నాడు. బబులోనుకు మూడువందల మైళ్ల దూరంలో యూఫ్రటీసులో కలిసిపోయే కెబారు నదీ ప్రాంతంలో అతడు స్థిరపడ్డాడు. త్వరలో (యెరూషలేము) తిరిగి వస్తారని చెర వాసులను గూర్చి ప్రకటించే అబద్ధ ప్రవక్తలు బయలు దేరారు. (మొదటిగా క్రీ.పూ. 606లో చెరగొని పోబడినది మొదలు) చెర కాలము డెభ్బై సంవత్సరాలు కొనసాగుతుందని యెరూషలేమునుండి యిర్మీయా ఉత్తరం పంపాడు. గనుక యిండ్లు కట్టుకొని, వనములను వాడుకొనుమని అతడు వారికి తెలియజేశాడు (యిర్మీయా 29). యెహెజ్కేలు తన దర్శనాలను కెబారు నదీ ప్రాంతంలో తన గ్రంథమందు దాఖలు చేస్తాడు. ఈ కాలంలోనే కీర్తన. 137 యిలా వ్రాయబడింది: “బబులోను నదుల యొద్ద కూర్చుండి యున్నప్పుడు ...”

## ప్రవక్తల యొక్క వర్గ విభజన[1]

I. వర్తమానం పొందినవారిననుసరించి
   A. ఇశ్రాయేలుకు: హోషేయ, ఆమోసు
   B. యూదాకు: యోవేలు, యెషయా, మీకా, జెఫన్యా, యిర్మీయా, హబక్కూకు, హగ్గయి, జెకర్యా, మలాకీ
   C. నీనెవెకు: యోనా, నహూము
   D. బబులోనుకు: దానియేలు
   E. చెర నివాసులకు: యెహెజ్కేలు
   F. ఎదోముకు: ఓబద్యా

II. సెప్టూజెంట్ననుసరించి (ఈ అమరిక ఇంగ్లీషు తర్జుమాలచే అనుసరించబడింది)
   A. పెద్ద ప్రవక్తలు: యెషయా, యిర్మీయా, (విలాపవాక్యములు), యెహెజ్కేలు, దానియేలు
   B. చిన్న ప్రవక్తలు: హోషేయ, యోవేలు, ఆమోసు, ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా, హగ్గయి, జెకర్యా, మలాకీ

III. కాలక్రమ పట్టికననుసరించి
   A. చెర కాలమునకు ముందు ప్రవక్తలు: ఓబద్యా, యోవేలు, యోనా, హోషేయ, ఆమోసు, యెషయా, మీకా, నహూము, జెఫన్యా, యిర్మీయా, హబక్కూకు
   B. చెర కాలపు ప్రవక్తలు: యెహెజ్కేలు, దానియేలు
   C. చెరానంతర కాలపు ప్రవక్తలు: హగ్గయి, జెకర్యా, మలాకీ

IV. అన్యజనుల లోకాధిపత్యపు కాలములననుసరించి
   A. అష్షూరు కాలము: ఓబద్యా, యోవేలు, యోనా, హోషేయ, ఆమోసు, యెషయా, మీకా, నహూము
   B. బబులోను కాలము: జెఫన్యా, యిర్మీయా, హబక్కూకు, దానియేలు, యెహెజ్కేలు
   C. పారసీకుల కాలము: హగ్గయి, జెకర్యా, మలాకీ

V. ప్రవక్తల యొక్క కాలములననుసరించి (ప్రవక్తల పరిచర్య యొక్క ఉరామరిక కాలము)

ఓబద్యా (క్రీ.పూ. 845); యోవేలు (క్రీ.పూ. 835); యోనా (క్రీ.పూ. 783); హోషేయ (క్రీ.పూ. 760); ఆమోసు (క్రీ.పూ. 760); యెషయా (క్రీ.పూ. 739); మీకా (క్రీ.పూ. 735); నహూము (క్రీ.పూ 650); జెఫన్యా (క్రీ.పూ. 640); యిర్మీయా (క్రీ.పూ. 627); హబక్కూకు (క్రీ.పూ. 609); దానియేలు (క్రీ.పూ 605); యెహెజ్కేలు(క్రీ.పూ. 593); హగ్గయి (క్రీ.పూ. 520); జెకర్యా (క్రీ.పూ. 520); మలాకీ (క్రీ.పూ. 433).

---

సూచన

[1]Hobart E. Freeman, *An Introduction to the Old Testament Prophets* (Chicago: Moody Press, 1968), 136